జ్ఞాన నేత్రం..

• ప్రత్యేక చదరంగం.. బ్రెయిలీ చదువులో ప్రతిభ

• రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్న అంధులు

గెలుపు మంత్రం

చూపు లేకున్నా చదరంగంలో ప్రతిభ చూపుతున్నారు.. చుక్కలను స్పృశిస్తూ.. ఎదుటి వారి ఎత్తులను పసిగడుతూ పైఎత్తులు వేస్తూ విజేతలుగా నిలుస్తున్నారు ఈ అంధ విద్యార్థులు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించి ప్రశంసలు అందుకుంటున్నారు. మరోవైపు బ్రెయిలీ లిపిలో మాతృభాష తెలుగును అత్యంత వేగంగా చదువుతూ ప్రత్యేక గుర్తింపు సాధించి అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

- న్యూస్‌టుడే, నంద్యాల పాతపట్టణం

అజిత్ అదుర్స్

నంద్యాల శివారులోని జీవనజ్యోతి అంధుల పాఠశాల వసతిగృహంలో ఉంటున్న దూదేకుల అజిత్ చదరంగంలో అద్భుత ప్రతిభ చూపుతున్నాడు. పదో తరగతి వరకు జీవనజ్యోతి పాఠశాలలో చదివిన అజిత్, ఇంటర్ ప్రభుత్వ కళాశాలలో చదివారు. ప్రస్తుతం నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. చదరంగంపై ఆసక్తి ఉండటంతో 4వ తరగతి నుంచే జీవనజ్యోతి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు ఆక్షర వద్ద శిక్షణ తీసుకున్నాడు. అంధులు వాడే చదరంగం బోర్డులో తెలుపు రంగు ఉన్న గడులకు చుక్కలు (డాట్స్) ఉంటాయి. నలుపు రంగు గడులకు ఉండవు. చుక్కల ఆధారంగా పావులు కదపడంలో పట్టు సాధించాడు అజిత్. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో జిల్లా, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తున్నాడు. అంతర్జాతీయ చదరంగం పోటీల్లో విజయం సాధించాలన్న లక్ష్యంతో సాధన చేస్తున్నట్లు చదరంగ క్రీడాకారుడు అజిత్.

○ 2023లో గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం అందుకున్నాడు.

○ 2023లో బెంగళూరులో నిర్వహించిన సౌత్‌జోన్ చెస్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించాడు.

○ 2024లో కేరళలో జరిగిన జాతీయస్థాయి చదరంగం పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకం గెలుపొందారు.

శభాష్.. లక్ష్మీకాంతరెడ్డి

○ గడివేముల మండలం బిలకలగూడూరుకు చెందిన లక్ష్మీకాంత రెడ్డి ప్రస్తుతం జీవనజ్యోతి పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. చదరంగంపై ఆసక్తితో శిక్షణ పొందాడు. రెండేళ్లలోనే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపుతూ పతకాలు సాధించాడు. జాతీయస్థాయిలో మంచి రేటింగ్ సాధించాలన్న లక్ష్యంతో సాధన చేస్తున్నట్లు ఈ విద్యార్థి చెబుతున్నాడు.

○ 2024 జూన్‌లో గుంటూరులో నిర్వహించిన అండర్-19 రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు.

○ 2024 అక్టోబరులో కేరళలో నిర్వహించిన జాతీయస్థాయి చదరంగం పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచి ప్రశంసాపత్రం అందుకున్నాడు.

చదవడంలో 'ప్రశాంతి' ఎక్స్‌ప్రెస్

○ జీవనజ్యోతి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ప్రశాంతి తెలుగు బ్రెయిలీ లిపిని వేగంగా చదవడంలో తనకు సాటిలేదని నిరూపించుకుంది. పాఠశాలలోనే జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకుంది.

○ 2023లో చిత్తూరులో బ్రెయిలీ లిపిలోని తెలుగు పుస్తకం చదివే పోటీలో ప్రథమస్థానంలో నిలిచి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకుంది.

○ 2022లో అనంతపురంలో నిర్వహించిన తెలుగు బ్రెయిలీ లిపిని చదివే పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బహుమతి అందుకుంది.

విద్యార్థులు సృజనాత్మకత పెంపొందించుకోవాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకుంటే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని కలెక్టర్ రాజకుమారి సూచించారు. పట్టణంలోని ఎస్పీజీ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం జరిగిన జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు రూపొందించిన సైన్సు, గణిత ప్రాజెక్టులను పరిశీలించారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠ్యాంశాలను కంఠస్థం చేసే విధానానికి స్వస్తిచెప్పి విశ్లేషణాత్మకంగా, ప్రయోగాత్మకంగా విద్యను అభ్యసించినప్పుడే ఉన్నత స్థితికి చేరుకుంటారని చెప్పారు. పాఠశాలల్లో నిర్వహించే వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖనం, వైజ్ఞానిక ప్రదర్శనల్లో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. డీఈవో జనార్దన్‌రెడ్డి, సమగ్ర శిక్షా అభియాన్ అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రేమంతకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

○ మండల స్థాయిలో ఎంపికైన 126 ప్రాజెక్టులను ఇక్కడ ప్రదర్శించారు. ఈ పోటీలను మూడు విభాగాల్లో నిర్వహించారు. ఒక్కో విభాగం నుంచి ఆరు ప్రాజెక్టులను ఈనెల రెండో వారంలో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు డీఈవో తెలిపారు.

విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా ముస్తాక్ అహమ్మద్, డీఈవో జనార్దన్‌రెడ్డి

○ వైజ్ఞానిక ప్రదర్శనలో వ్యక్తిగత విభాగంలో డోన్ కేజీబీవీ పాఠశాల విద్యార్థిని చైతన్య ప్రథమ, పలుకూరు జడ్పీ పాఠశాల విద్యార్థిని సాయిదీపిక ద్వితీయ, బృందం విభాగంలో పాములపాడు జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు జోష్, జగదీశ్వర్ ప్రథమ, డోన్ ఏపీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాల విద్యార్థులు సుభాషిణీ బాయి, శశికళ ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

○ అటల్ విభాగంలో ఆత్మకూరు బాలికోన్నత పాఠశాల విద్యార్థిని ఆసియా తబసుమ్ ప్రథమ, పాణ్యం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని జోత్స్నశ్రీ ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

○ ఉపాధ్యాయుల విభాగంలో శిరివెళ్ల కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయురాలు స్రవంతి ప్రథమ, ఎస్.కొత్తపల్లి జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయురాలు శైలజ ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలకు రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా ముస్తాక్ అహమ్మద్, డీఈవో జనార్దన్‌రెడ్డి బహుమతులు అందజేశారు.

ఆలోచన అదిరె...

• జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ

ఆవిష్కరణ మెరిసే

అందరి కంటే భిన్నంగా ఆ విద్యార్థులు ఆలోచించారు. చక్కటి ఆవిష్కరణలతో అందరి ప్రశంసలు పొందారు. బుర్రకు పదును పెట్టి రూపొందించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలను నంద్యాల పట్టణంలోని ఎస్పీజీ ఉన్నత పాఠశాలలో ప్రదర్శించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తయారు చేసినవి చూపరులను అలరించాయి. భౌతిక, రసాయన, గణితం, జీవ శాస్త్రం, పర్యావరణం, కంప్యూటర్ విజ్ఞాన సంబంధ ప్రాజెక్టులను తయారు చేసిన విద్యార్థులు అందరి మెప్పును పొందారు.

- న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

హార్ట్ సర్క్యులేషన్ ఆఫ్ బ్లడ్ ప్రాజెక్టును తయారు చేసిన విద్యార్థులు

గుండె నుంచి శరీర భాగాలకు ప్రసరణ

అన్నదమ్ముల్లైన బేతంచెర్ల ఎంజేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి ప్రశాంత్ నాయక్, 10వ తరగతి విద్యార్థి నిశాంత్ నాయక్ బృంద విభాగంలో హార్ట్ సర్క్యులేషన్ ఆఫ్ బ్లడ్‌ను తయారు చేశారు. గుండె, ఊపిరితిత్తుల పనితీరును స్పష్టంగా వివరించేలా ఈ పరికరాన్ని తయారు చేశారు. గుండె ఎలా కొట్టుకుంటోంది, రక్తం గుండెకు ఎలా సరఫరా అవుతుంది..గుండె నుంచి మనిషి శరీర భాగాలకు ఎలా ప్రసరిస్తుందనే విషయాన్ని ఈ పరికరం తెలియజేస్తుంది.

వంతెన తెరుచుకునే అవకాశం

అవుకు మండలం చెర్లోపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వెంకటేశ్వర్లు హైడ్రాలిక్ బ్రిడ్జ్‌ను వ్యక్తిగత విభాగంలో తయారు చేశారు. ఈ వంతెన నదుల్లో పెద్ద పెద్ద పడవలు, స్టీమర్లు వెళ్లే సమయంలో నదిలోని నీటిని వినియోగించుకొని సెన్సార్ల ద్వారా దానికదే తెరుచుకుని పడవలు వెళ్లిన తర్వాత తానంతట అదే మూసుకుంటుంది. దీని వల్ల విద్యుత్తు, ఇంధన ఖర్చు తగ్గుతుంది. పర్యావరణానికి మేలు కలుగుతుంది.

హైడ్రాలిక్ బ్రిడ్జిని తయారు చేసిన విద్యార్థి

చంద్రుడిపై వాతావరణం తెలుసుకునేలా

ఆళ్లగడ్డ వైపీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న దీపక్ విక్రమ్ ల్యాండర్‌ను వ్యక్తిగత విభాగంలో తయారు చేశారు. విక్రమ్ ల్యాండర్ పరికరం చంద్రుడిపై ఉన్న వాతావరణాన్ని, అక్కడి విశేషాలను ఫొటోలు తీసి పంపిస్తోంది. దీంతో చంద్రుడిపై పరిశోధనలకు సులభంగా ఉంటుంది.

విక్రమ్ ల్యాండర్‌ను తయారు చేసిన విద్యార్థి

నడవలేని వారికి ఉపయోగం

నందివర్గం జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు జయచంద్ర, భరత్ జాయిస్టిక్ బేస్డ్ వీల్ చైర్‌ను తయారు చేశారు. వృద్ధులు, పక్షవాతం వచ్చిన వారు, నడవలేని స్థితిలో ఉన్న వారికి ఇది ఎంతో ఉపయోగంగా ఉంటోంది. ఎవరినైనా పిలవడానికి బటన్ నొక్కితే హారన్ మోగుతుంది. టాయిలెట్‌లో మాదిరిగా కూర్చోవడానికి వీలుగా కుర్చీ కింద రంధ్రం ఏర్పాటు చేశారు. వీల్‌చైర్‌లో కూర్చొని జాయిస్టిక్‌తో ఆపరేట్ చేసుకుంటూ ఇళ్లలో, బయట ఎక్కడికైనా తిరిగే వీలుంది.

జాయిస్టిక్ బేస్డ్ వీల్‌చైర్‌ను తయారు చేసిన విద్యార్థులు

భౌగోళిక స్వరూపం అర్థమయ్యేలా

డోన్ పట్టణం ఎస్‌ఎస్ కాలనీలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని శారదాదేవి టీచరు విభాగంలో భారత దేశం భౌగోళిక స్వరూపాలు తెలిపే పరికరాన్ని తయారు చేశారు. దేశంలోని హిమాలయాలు, గంగా, సింధూ మైదానం, ద్వీపకల్పాలు, పీఠభూములు, తీర మైదానాలు, థార్ ఎడారి, దీవులు భారత దేశ చిత్ర పటంపై ఎక్కడ ఉన్నాయనేది వివరంగా ప్రదర్శించారు. భారత దేశ భౌగోళిక స్వరూపం విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా రూపొందించారు.

ఇండియా రిలీఫ్ ఫీచర్స్‌ను తయారు చేసిన ఉపాధ్యాయిని శారదాదేవి

ప్రాణనష్టం నివారణ

సంజామల కేజీబీవీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విష్ణుప్రియ, హరిత బృంద విభాగంలో రిమోట్ యాక్సిడెంట్ రిపోర్ట్ సిస్టం అనే పరికరాన్ని తయారు చేశారు. ట్రాన్స్ మీటరును కారులో అమర్చుకుంటే ప్రమాదం ఎక్కడ జరిగిందో ఆ ప్రదేశం, కారు నంబరుతో సహా సమాచారం ఆసుపత్రులకు లేదా ఇళ్లకు వెంటనే వెళ్తుంది. దీంతో ప్రమాదం జరిగిన ప్రదేశానికి త్వరగా చేరుకోవచ్చు. ప్రాణ నష్టాన్ని నివారించవచ్చు.

రిమోట్ యాక్సిడెంట్ రిపోర్ట్ సిస్టంను తయారు చేసిన విద్యార్థినులు

నృసింహుని ఉత్సవం.. చూసిన కనులదే భాగ్యం

స్వామి, అమ్మవార్ల ఉత్సవం

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు శాస్త్రోక్తంగా సాగుతున్నాయి. రాపత్తు ఉత్సవంలో భాగంగా స్వామి, అమ్మవార్లు విశేష పూజలందుకుంటున్నారు. శుక్రవారం ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను పల్లకిపై కొలువుదీర్చి తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయ ఆవరణలోని దేవతామూర్తుల సన్నిధి వద్ద మంగళశాసనం చేశారు. వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి,అమ్మవార్లను కొలువుంచి అర్చకులు వేదప్రబంధ పారాయణాలు పఠించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ధనుర్మాస పూజల్లో భాగంగా ఆర్చక బృందం పాశురాలను విన్నవించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిదాంబి వేణుగోపాలన్, మేనేజర్ మురళీధరన్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

మహానందీశునికి పల్లకి సేవ

పల్లకి సేవలో భాగంగా హారతి ఇస్తున్న పండితుడు

మహానంది, న్యూస్‌టుడే : మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి దేవస్థానం ఆధ్వర్యంలో గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామివార్లకు పల్లకి సేవ నిర్వహించారు. అర్చకులు వేదోక్తంగా విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులు శివ పంచాక్షరీ మంత్రాన్ని జపిస్తుండగా అంతర ప్రాకారోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రొటోకాల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎస్.శ్రీనివాసులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైకాపా నాయకుడిపై రౌడీషీట్

గన్ని కరీం

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణంలోని ఫరూక్ నగర్‌కు చెందిన వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గన్ని కరీంపై రౌడీషీట్ తెరిచిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఒకటో పట్టణ సీఐ సుధాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపిన వివరాల మేరకు.. ఫరూక్ నగర్‌కు చెందిన్న గన్ని కరీం గత నెల ఓ వ్యక్తి డబ్బులు ఇవ్వలేదని బెదిరించడంతో పాటు దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల ముందు గన్ని కరీం సామాజిక మాధ్యమాల్లో భాజపా, తెదేపాపై అభ్యంతరకరమైన పోస్టులు చేసేవారు. అప్పట్లో ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో అతనిపై కేసు నమోదు చేశారు. గన్ని కరీం బెదిరింపులకు పాల్పడుతున్నారని డిసెంబరు 31న పోలీసులు ఉన్నతాధికారులకు రౌడీషీట్ ఓపెన్‌పై ప్రతిపాదనలు పంపారు. వారి ఆదేశాల మేరకు రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో జైలు

పామూరు, న్యూస్‌టుడే: చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. నూనెపల్లి గ్రామానికి చెందిన పి.అబ్దుల్ కరీంఖాన్ ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన షేక్ ఖాదర్ బాషా వద్ద రూ.7 లక్షలు అప్పుగా తీసుకున్నారు. నగదు చెల్లించే నిమిత్తం రూ.5 లక్షల చెక్కు అందజేయగా అది చెల్లుబాటు కాలేదు. అబ్దుల్ కరీంఖాన్‌కు ఏడాది జైలుశిక్ష విధించడంతో పాటు, బాధితునికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని శుక్రవారం తీర్పునిచ్చారు.

మసీదుపురంలో తెదేపా, వైకాపా వర్గీయుల ఘర్షణ

మసీదుపురం (మహానంది), న్యూస్‌టుడే : మహానంది మండలం మసీదుపురం గ్రామంలో వైకాపా, తెదేపా వర్గీయులు గురువారం రాత్రి కర్రలు, రాళ్లతో పరస్పర దాడులకు పాల్పడ్డారు. ఈ ఘర్షణలో గాయపడిన వారు నంద్యాల సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామానికి చెందిన తెదేపా వర్గీయులు మల్లెపోగు ఆనందరావు అలియాస్ సన్నన్న, సులక్ష, చందనం రాజేష్, చిన్నక్క, ఓబులేసు, బాలయ్య గాయపడ్డారని ఆ పార్టీ వారు తెలిపారు. వైకాపా వర్గానికి చెందిన శేషన్న, ఏసు, నరసింహులు, పెద్ద దానమ్మ, చిన్న దానమ్మలు గాయపడ్డారని చెబుతున్నారు. నూతన సంవత్సర వేడుకల నిర్వహణతో పాటు పాడైన బోరుకు మరమ్మతులు చేయించేపోవడంపై తలెత్తిన వివాదాలే ఘర్షణకు కారణమని గ్రామస్థులు తెలిపారు. సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించి పరిస్థితులను అదుపులో ఉంచామని మహానంది ఎస్సై ఎన్.రామ్మోహన్‌రెడ్డి చెప్పారు. నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
రీజనల్ ఆఫీసు, గుంటూరు
నోటిఫికేషన్
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ ఆఫీస్ గుంటూరు వారు గుంటూరు, బాపట్ల, పల్నాడు, వై.యస్.ఆర్. కడప, నంద్యాల, తిరుపతి జిల్లాలలో (02 పోస్టులు) కాంట్రాక్టు ప్రాతిపదికన బిజినెస్ కరస్పాండెంట్ సూపర్‌వైజర్‌ను నియమించుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానించడమైనది. దరఖాస్తులను సమర్పించుటకు చివరి తేదీ 24.01.2025. దరఖాస్తు ఫారం, ఎంపిక ప్రక్రియ మరియు నిబంధనల కొరకు బ్యాంక్ వెబ్‌సైట్ www.centralbankofindia.co.in లో "రిక్రూట్‌మెంట్"ను సందర్శించండి.
సం/- రీజనల్ హెడ్

పాల డెయిరీ ఎన్నిక వాయిదా

• వైకాపా నాయకులకు వత్తాసు పలికారని తెదేపా నాయకుల ఆందోళన

• చిన్నవంగలిలో ఉద్రిక్తత

తెదేపా మండల కన్వీనరుతో వాగ్వాదానికి దిగిన సీఐ

చిన్నవంగలి(చాగలమర్రి), న్యూస్‌టుడే: చిన్నవంగలి గ్రామ పాల డెయిరీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియలో ఉద్రిక్తత నెలకొంది. గతేడాది డిసెంబరు 4న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాకుండానే శాంతి భద్రతల దృష్ట్యా వాయిదా వేసిన సంగతి తెలిసిందే. శుక్రవారం తెదేపా నాయకులు ఇద్దరు నామినేషన్లు వేయగా, వైకాపా నాయకులు ఇద్దరు నామినేషన్ల దాఖలుకు వచ్చిన నేపథ్యంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. కొన్ని పత్రాలు ఈ ఘటనలో చిరిగిపోయాయి. పోలీసులు ఇరువర్గాలను పంపించేస్తుండగా...వైకాపా నాయకులకు పోలీసులు వత్తాసు పలికారని తెదేపా నాయకులు ప్రశ్నించారు. తెదేపా నాయకులను ఆళ్లగడ్డ గ్రామీణ సీఐ కంబగిరిరాముడు, కోవెలకుంట్ల సీఐ హనుమంతనాయక్, పోలీసులు పంపించే ప్రయత్నం చేశారు. తెదేపా మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి తమ పార్టీ శ్రేణులను ఎందుకు వెళ్లగొడుతున్నారని, మీరేమైనా వైకాపా ప్రభుత్వంలో పని చేస్తున్నారా ? అంటుండగా, సీఐలు, పోలీసులు వారిని లాగారు. ఈ ఘటనలో నరసింహారెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి చొక్కాలు చిరిగిపోయాయి. తెదేపా నేతలు అర్ధనగ్నంగా కూర్చొని సీఐ డౌన్ డౌన్ అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో స్థానిక అధికారులు ఎన్నికలను వాయిదా వేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా చర్యలు తీసుకున్నారు.

చొక్కాపట్టి చించిన సీఐ

అధికార పార్టీ ఐతే నాకేంటి, లాయర్ ఐతే నాకేంటని ఆళ్లగడ్డ గ్రామీణ సీఐ కంబగిరిరాముడు తన చొక్కాను పట్టుకుని చించేశారని తెదేపా మండల కన్వీనరు లాయర్ నరసింహారెడ్డి ఆరోపించారు. ఎన్నికల కేంద్రం వద్ద పోలీసులు వైకాపా నాయకులకు వత్తాసు పలికారన్నారు. ఆళ్లగడ్డ గ్రామీణ సీఐ ఇంకా వైకాపా ప్రభుత్వంలోనే ఉన్నట్లు వ్యవహరిస్తున్నారన్నారు. పార్టీ, ఉన్నతాధికారులు స్పందించి సీఐపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వైకాపా పుర ఛైర్మన్ తండ్రి అక్రమం

కర్నూలు, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా డోన్ పట్టణ పుర వైకాపా ఛైర్మన్ గంట సప్తశైల రాజేష్ తండ్రి గంట తిమ్మయ్య అక్రమంగా ఇల్లు దాన్ని నిర్మించారని అధికారులు నోటీసులు జారీ చేశారు. డోన్ పట్టణంలోని నెహ్రూనగర్‌లో రోడ్డును ఆక్రమించి కట్టడాలు చేపట్టడంతో పురపాలక కమిషనర్ ప్రసాద్ గౌడ్, పట్టణ ప్రణాళిక విభాగం చర్యలకు సిద్ధమయ్యారు. పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన గంట తిమ్మయ్య రోడ్డుపై మెట్లు, ప్రహరీని కట్టి రోడ్డు ఆక్రమించేశారని తెలిపారు. నెహ్రూనగర్‌లోని 20/1978లో ఉన్న ప్లాట్ నెంబరు 72లో గల 30 అడుగుల రోడ్డును 47.925 చ.మీ.లు (18.17మీ ఇంటు 2.5మీ) మేర ఆయన ఆక్రమించేశారని పురపాలక కమిషనర్ ప్రసాద్‌గౌడ్, టీపీఎస్ శబరీష్ 2024 నవంబరు 26న నోటీసు జారీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సిబ్బంది నోటీసులు ఇవ్వడానికి వెళ్లగా ఆరోజున ఛైర్మన్ తండ్రి ఇంటి వద్ద లేనట్లు చెప్పారు.

ఉపాధి పనులు చూపడంలో నిర్లక్ష్యం వీడాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. నంద్యాల కలెక్టరేట్ నుంచి ఉపాధి హామీ పథకం లక్ష్యాలు, ప్రగతిపై శుక్రవారం ఆమె సమీక్షించారు. ఉపాధిహామీ కింద పనులు కల్పించడంలో ఏపీడీ, ఏపీవోలు నిర్లక్ష్యం వహిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. లేబర్ బడ్జెట్ కింద వేతనదారులకు

సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

వంద రోజుల పనిదినాలు కల్పించడంలో పూర్తిగా వెనుకబడి ఉన్నారన్నారు. పని తీరు అధ్వానంగా ఉన్న అధికారుల వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. లేబర్ బడ్జెట్, దినసరి వేతనం, గోకులం షెడ్లు తదితర పనులన్నీ మార్చి 31 లోగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 2.30 లక్షల మంది వేతనదారులు ఉంటే 3 వేల మందికి మాత్రమే వంద రోజుల పనిదినాలు కల్పించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో డ్వామా పీడీ జనార్దన్‌రావు, పశు సంవర్ధకశాఖ అధికారి గోవిందనాయక్ తదితరులు పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలి

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: కలువటాలకు సమీపంలోని రామ్‌కో సిమెంట్ కర్మాగారం ఆవరణలో పర్యావరణ అధికారి కిశోర్ ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేసీ విష్ణుచరణ్ ఈ సందర్భంగా మాట్లాడుతు సిమెంటు కర్మాగారంలో ఉత్పత్తి విస్తరణలో భాగంగా పాల్గొన్న ప్రజాప్రతినిధులు, సర్పంచులు సలహాలు, సూచనలు ఇవ్వాలని చెప్పారు. కలువటాల సర్పంచి కామినేని సుమలత(తెదేపా) మాట్లాడుతూ గ్రామంలో ఉన్న దేవాలయాలను అభివృద్ధి చేయాలన్నారు. గ్రామంలో భూములు కోల్పోయిన రైతులకు చెందిన కుటుంబాల్లో చాలా మంది చదువుకున్న వారు ఉన్నారని, వారికి ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. గ్రామంలో భూములు కోల్పోయిన వారు కూలీలుగా వలస వెళ్తున్నారని, వారికి కర్మాగారంలో ఉపాధిని కల్పించాలని చెప్పారు. తెదేపా మండల అధ్యక్షుడు మూలె రామేశ్వరరెడ్డి మాట్లాడుతూ మీర్జాపురం, కలువటాల, కొలిమిగుండ్ల గ్రామాల రైతులకు చెందిన కొనని భూముల్ని కర్మాగారం కొనుగోలు చేయాలన్నారు. కర్మాగారం నుంచి దుమ్ము, ధూళి వస్తోందని, పంటలపై పడటంతో రైతులు చాలా నష్టపోయారన్నారు. రైతులకు పంటనష్ట పరిహారం ఇవ్వాలన్నారు. చదువుకొన్న వారికి నైపుణ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి వారికి అన్ని విషయాలు తెలియజేసి కర్మాగారంలో ఉద్యోగాలు ఇవ్వాలని చెప్పారు. కర్మాగారానికి చెందిన యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు మాట్లాడుతు స్కిల్‌డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, అంబులెన్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. కాలుష్యం లేకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సీబీఎస్ పాఠశాలను నిదానంగా ఏర్పాటు చేస్తామన్నారు. పార్కు, పాఠశాలలను అభివృద్ధి చేస్తామన్నారు. పర్యావరణశాఖ టెక్నికల్ అసిస్టెంటు చంద్రమౌళి, జిల్లా పరిషత్ ఛైర్మన్ పాపిరెడ్డి, మీర్జాపురం, కొలిమిగుండ్ల గ్రామాలకు చెందిన సర్పంచులు మహేశ్వరరెడ్డి, శివరాముడు, తహసీల్దారు బాలీశ్వరరెడ్డి, సీఐ రమేష్‌బాబు, పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న జేసీ విష్ణుచరణ్

EENADU eClassifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER
నంద్యాల మరియు నంద్యాల దగ్గరలో గల పరిసర ప్రాంతములలో 100 Sq.Yds. నుండి 1000 Sq.Yds. వరకు గల Site (స్థలం) Construction / Development చేయబడును. సంప్ర: 78421 61277.

REAL ESTATE

FLAT FOR SALE
కర్నూలు 10 నిమిషాల్లో వెంకన్న రోడ్డు ఒమేగా హాస్పిటల్ దగ్గర డబుల్ బెడ్ రూమ్ (ఫుల్ ఫర్నిష్డ్) ఫ్లాట్ అమ్మబడును. ☎ 91603 63630, 99631 40128.
సంతోష్ నగర్, హైదరాబాద్ హైవే రోహిత్ ప్లాజా నందు 2 BHK, 3 BHK, Flats రెడీ టు ఆక్యుపై ఉన్న అధునాతన వసతులతో అమ్మబడును సంప్ర. ☎ 91600 38888.

PLOT FOR SALE
కర్నూలు ఉలిందకొండ హైవేకు NH-44, అంజిరెడ్డి గ్రీన్ పార్క్స్ ఫామ్ ల్యాండ్ మరియు ఓపెన్ ప్లాట్స్ అమ్మబడును. సంప్ర: 99851 20512, 99591 83629.

JOBS
WANTED Sales Executives for Hyundai Car Show Room in Kurnool, Nandyal & Adoni. Contact: 91333 14336, 91601 14474. Salary + Incentives + Allowances.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఎటువంటి సంబంధం లేదు. ప్రకటనదారులు వస్తువుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును తమ ఖాతాలో వేసుకునే ప్రకటనకర్తను బ్లాక్ లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.